సంపుటి :02 సంచిక :225 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

బుధవారం 21, జనవరి 2026



## అభివృద్ధి పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటా
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లిలో పలు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

05

## వాహనదారులు రూల్స్ పాటించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

05



## వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
కాజీపేట ఆర్వోబీ పనుల పరిశీలన

02



## అక్రమాస్తులు రూ. 8.30 కోట్లు

- అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి నివాసాల్లో ఏసీబీ సోదాలు
- పక్కా ప్లాన్ తో ఏకకాలంలో తనిఖీలు
- గత నెలలో రూ.60 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వెంకట్ రెడ్డి
- తదుపరి చర్యల్లో భాగంగా తాజా సోదాలు

05



# మహాజాతరకు అంకురార్పణ

## మేడారంలో 'మండమెలిగే' పండుగ

- పవిత్ర జలాలతో ఆలయ శుద్ధి
- పుట్టమట్టితో అలికి మామిడి తోరణాల అలంకరణ
- బొడ్రాయికి అభిషేకాలు.. ఊరేగింపు
- మరో వారం రోజుల్లో జాతర షురూ

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, కష్టాల్లో తోడుండే వనదేవతల మహాజాతరకు ముహూర్తం ఖరారైంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు బుధవారం సంప్రదాయబద్ధంగా అంకురార్పణ జరిగింది. ఆదివాసీలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే 'మండమెలిగే' పండుగతో వనదేవతల కొలువులో ఆధ్యాత్మిక సందడి మొదలైంది. అడవి బిడ్డల ఆచారాల ప్రకారం ఆలయ శుద్ధి, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో జాతర అధికారికంగా ప్రారంభమైంది.


– అక్షర దర్బార్, మేడారం

02

## మినీ మేడారం జాతరలో రాజకీయ జోక్యం వద్దు!

- పాత పద్ధతిలోనే ఉత్సవాలు నిర్వహించాలి
- హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు
- ఎండోమెంట్ అధికారుల పెత్తనంపై న్యాయస్థానం సీరియస్

03





## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలి



- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి
- ఎస్ఈసీ రాణి కుముదిని
- మహబూబాబాద్ కలెక్టర్, యంత్రాంగంతో వీసీ

## ఎన్నికలకు అంతా రెడీ

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్





# మహాజాతరకు అంకురార్పణ

- మేడారంలో 'మండమెలిగే' పండుగ
- పవిత్ర జలాలతో ఆలయ శుద్ధి
- పుట్టమట్టితో అలికి, మామిడి తోరణాల అలంకరణ
- బొడ్రాయికి అభిషేకాలు.. ఊరేగింపు
- తతమరో వారం రోజుల్లో జాతర షురూ

**అక్షరదర్బార్, మేడారం :**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతరలో బుధవారం తొలి అంకురార్పణ జరిగింది. ఆదివాసీల అత్యంత పవిత్రమైన సంప్రదాయం 'మండమెలిగే' పండుగను నిర్వహించ డంతో జాతర అధికారికంగా ప్రారంభమైంది. ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క ప్రధాన ఆలయంతో పాటు కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయా లను గిరిజన పూజారులు పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. వనదేవతలు కొలువైన ప్రాంతాలను పుట్ట మట్టితో అలికి, పచ్చని మామిడి తోరణాలతో అలం కరించారు. జాతరపై ఎటువంటి చెడు దృష్టి పడకుండా, దుష్టశక్తుల నుంచి రక్షణ కల్పించడమే ఈ పండుగ ఉద్దేశమని గిరిజన పూజారులు చెబుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా పూజారులు అత్యంత రహస్యంగా ప్రత్యేక ఆచారాలు నిర్వహించారు. సమ్మక్క ప్రధాన పూజారి ఇంటి నుంచి డోలు వాయిద్యాల మధ్య పసుపు, కుంకుమ లతో మేడారం గ్రామం చుట్టూ ఊరేగింపు సాగింది. ఆదివాసీ ఆడబిడ్డలు గ్రామంలోని బొడ్రాయికి శుద్ధ జలంతో అభిషేకాలు నిర్వహించి, బూరుగు కొమ్మలతో దిష్టి తోరణాలు కట్టారు. ఈ వేడుకను 'మినీ మేడారం'గా భావిస్తారు. ఈ రోజు నుంచి జాతర ముగిసే వరకు కోయ పూజారులు కఠినమైన నియమాలను పాటిస్తారు. ప్రధాన ఆలయాల్లో పూజలు జరుగుతున్న సమయంలో సామాన్య భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నియంత్రించారు.

## - వారం రోజుల్లో జాతర

మహాజాతర ప్రధాన ఘట్టాలు ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజైన 28న కన్నెపల్లి నుంచి సారలమ్మ గద్దెకు చేరుకోనుం డగా, 29న చిలుకలగుట్ట నుంచి సమ్మక్క కుంకుమ భరిణె రూపంలో రానుంది. 30న అమ్మవార్లు ఇద్ద రూ గద్దెలపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. 31న అమ్మవార్ల వనప్రవేశంతో ఈ మహా వేడుక ముగుస్తుంది. ఇప్పటికే భక్తులు భారీగా మేడారానికి చేరుకుంటున్నారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ 3,495 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. భద్రత దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

## - ఆర్టీసీ బస్సులు

మేడారం సమ్మక్క– సారలమ్మ మహాజాతరకు తరలి వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేసింది. జాతర రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈనెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మొత్తం 3,495 ప్రత్యేక బస్సులను నడపాలని అధికారులు నిర్ణయిం చారు. రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాలైన హైదరాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం వంటి ప్రాంతాల నుంచి నేరుగా మేడారానికి ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. సాధారణ ఛార్జీల కంటే యాభై శాతం అదనపు ధరతో ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళ లకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఈసారి భక్తుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## మేడారంలో బస్ టెర్మినల్

భక్తుల రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేడారంలో 50 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద తాత్కాలిక బస్ టెర్మినల్ ను నిర్మించారు. ప్రయాణికుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను కల్పించారు. సొంత వాహనాల్లో వచ్చే వారి కోసం పోలీసులు ప్రత్యేక మార్గాలను కేటాయించారు. వరంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలు ములుగు, పస్రా మీదుగా మేడారానికి చేరుకోవాల్సి ఉంటుంది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వన్-వే నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారు. ప్రైవేట్ వాహనాల కోసం గద్దెలకు కొంత దూరంలోనే విశాలమైన పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు సేవలందించేందుకు వైద్యారో గ్య శాఖ సమన్వయంతో ప్రత్యేక బృందాలను కూడా రంగంలోకి దించారు. కాలినడకన వచ్చే భక్తుల కోసం రహదారి పొడవునా విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేశారు. సమయాన్ని ఆదా చేయాలనుకునే సంపన్న భక్తుల కోసం హన్మకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సర్వీసులు నడిపేందుకు ప్రైవేట్ సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. భక్తులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేస్తోంది.



# వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేట ఆర్వోబీ పనుల పరిశీలన

అక్షరదర్బార్, కాజీపేట: కాజీపేట ఫాతిమా నగర్ నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను బుధవారం సంబంధిత రోడ్లు, భవనాల శాఖ అధికారులతో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణంలో జరుగు తున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, పనులను వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరను దృష్టిలో పెట్టుకొని ప్రజా రవాణాకు ఈ ఆర్వోబీని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నిధులను సత్వరమే మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. అయితే అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల పనుల్లో కొంత జాప్యం చోటు చేసుకున్నట్లు చెప్పారు. ప్రధానంగా ఈ బ్రిడ్జి రైల్వే శాఖ పరిధిలో ఉండటం, నిర్మాణానికి అవసరమైన భారీ పరికరాలు ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావాల్సి రావడం వల్ల ఆలస్యం జరిగిందని వివరించారు. అయినప్పటికీ రైల్వే అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, సమ స్యలను పరిష్కరిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రానున్న అతి కొద్ది కాలంలోనే కాజీపేట ఆర్వోబీ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. మేడారం జాతరకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో, వారికి ఎలాంటి ట్రాఫిక్ అంతరా యాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగర నలువైపులా ఉన్న బ్రిడ్జిల పనులను వేగంగా పూర్తి చేయడానికి ఎమ్మెల్యేలందరం సమిష్టిగా కృషి చేస్తున్నామని, ప్రజల సౌకర్యమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా సమర్థవంతమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికే రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి నిట్ నుంచి హంటర్ రోడ్డు వరకు రోడ్డు వెడల్పు ప్రక్రియను ప్రారంభించామని, ఈ పనులు పూర్తైతే నగరంలో రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



అక్షరదర్బార్, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం గౌడ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2026 నూతన క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్ అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు గౌడ కులస్తుల సంక్షేమం కోసం జిల్లా కేంద్రంలో ఎదుర వుతున్న పలు సమస్యలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణ రావుకు మౌఖికంగా వివరించారు. ముఖ్యంగా గౌడ కుల కమ్యూనిటీ అవసరాల కోసం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, అందుకు అవసరమైన భూమిని కేటాయించాలని కోరారు. రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణం కోసం తగిన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బుర్ర సునీత గౌడ్, వేముల సదానందం గౌడ్, బుర్ర రాజబాబు గౌడ్, చిర్రా రఘు గౌడ్, పెరుమాండ్ల కృష్ణమూర్తి గౌడ్, దాసరి చంద్రమౌళి గౌడ్, బుర్ర కుమారస్వామి గౌడ్, అంబటి దేవేందర్ గౌడ్, బాలవేణి రాంబాబు గౌడ్, ముక్కెర హేమంత్ గౌడ్, తడక మహేష్ గౌడ్, గుర్రం రాజు గౌడ్, ధనుంజయ గౌడ్, నాగరాజు గౌడ్, ప్రతి శ్రీకాంత్ గౌడ్, దూలం సురేష్ గౌడ్, తోట సురేష్ గౌడ్, గాజర్ల ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు 25 వేల మాస్కులు అందజేత

## - ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు పి.మన్మోహన్ రాజు



అక్షరదర్బార్, మేడారం: మేడారం సమ్మక్క– సారలమ్మ మహాజాతరలో ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వరంగల్ శాఖ మంచి ముందడుగు వేసింది. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులతో పాటు విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి అంటువ్యా ధులు సోకకుండా ఉండేందుకు 25,000 మాస్కులను ఐఎంఏ రాష్ట్ర శాఖ సహకారంతో పంపిణీ చేసింది. లక్షలా దిగా భక్తులు హాజరయ్యే ఇలాంటి మహా జాతరల్లో శ్వాసకోస సంబంధిత వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టినట్లు ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ పి.మన్మోహన్ రాజు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ సురక్షితమైన జాతర నిర్వహణకు సహకరిస్తా మని వారు స్పష్టం చేశారు. మాస్కులను ములుగు కలెక్టర్ టి.ఎస్. దివాకర్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌లకు ఐఎంఏ ప్రతినిధులు వారి కార్యాలయంలో అధికారికంగా అందజే శారు. వీటిని జాతర ప్రాంగణంలో నిరంతరం శ్రమిస్తున్న సిబ్బందికి, భక్తులకు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ వరంగల్ ఆర్థిక కార్యదర్శి డాక్టర్ వి. నరేష్ కుమార్, సిడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ బండెల మోహన్ రావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు డాక్టర్ కస్తూరి ప్రమీల పాల్గొన్నారు.



- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- నర్సంపేటలో భారీ ప్రజా నిరసన ర్యాలీ

## దగా కోరు కాంగ్రెస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయి

అక్షరదర్బార్, నర్సంపేట: ఎన్నికల ముందు అసాధ్యమైన హామీలు ఇచ్చి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నర్సంపేట పట్టణంలో భారీ ప్రజా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల ప్రశ్నల నుంచి తప్పించుకోవడానికి పునాదిరాళ్ల పేరుతో గుర్తింపు లేని పనులకు శిలాఫలకాలు వేస్తున్నారన్నారు. నర్సంపేటలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అవసరమైన నిధులన్నీ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టితో మంజూరు చేశారన్నారు. మిషన్ భగీరథ, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల పనులు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిన తర్వాత వాటిని కొనసాగించకుండా ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన రూ.2,500 హామీ అమలు చేయక 25 నెలలకు రూ.62,500 బాకీ పెట్టారని, రైతులు, విద్యార్థులు, మహిళలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో RSS రాష్ట్ర మాజీ డైరెక్టర్, రాయిడి రవీందర్ రెడ్డి,నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కలపల్లి రవీందర్ రావు, మునిగాల వెంకటరెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి, నాగలి వెంకట్ నారాయణ, నాగిశెట్టి ప్రసాద్ గోన యువరాజ్ ,పట్టణ పార్టీ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి

**–ఎంసిపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**


అక్షర దర్బార్, దుగ్గొండి: రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు, పార్టీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఎంసిపీఐ(యు) రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను మూడు రోజులపాటు గిర్నిబావిలోని జీఆర్బీ కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. బుధవారం గిర్నిబావిలో పార్టీ మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న జాతీయ–అంతర్జాతీయ–రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సైద్ధాంతిక స్థాయిని పెంపొందించేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపకరిస్తాయన్నారు. జనవరి 22, 23, 24 తేదీల్లో నిర్వహించే ఈ తరగతులను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, కన్నం వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబా బాబూరావు, డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాయబ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ సమస్యలపై బీజేపీ నిరసన




అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణ సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నేత  డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. పరకాలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అన్యాయం చేశాయని విమర్శించారు. అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వ్యాపారాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని 22 వార్డుల్లో గెలిపిస్తే పరకాల అభివృద్ధిని చేసి చూపెడతామని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ద్వారా నిధులు తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో చందుపట్ల రాజేందర్ రెడ్డి, ఆర్పి జయంత్ లాల్ ,దేవునూరి మేఘనాథ్ ,కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, ఎర్ర రామన్న ,సంఘ పురుషోత్తం, దగ్గు విజేందర్ రావు ,కుక్కల విజయ్, బాసాని సోమరాజు పాల్గొన్నారు.

## మూడవరోజు సర్పంచ్ లకు శిక్షణ



అక్షర దర్బార్, పరకాల: హసన్ పర్తిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ & గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతన సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు పాల్గొని పంచాయతీ పాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అవగాహన పొందారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎం.పి.ఓ పాల్గొని సర్పంచ్‌లకు మార్గనిర్దేశం చేశారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని వారు సూచించారు.

### గణతంత్ర దినోత్సవ వేడుకలు
## ఘనంగా నిర్వహించాలి

**–అన్ని శాఖల సమన్వయం అవసరం: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

అక్షర దర్బార్, భూపాలపల్లి: 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వేడుకల ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. డా. బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానం పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు.



## మినీ మేడారం జాతరలో రాజకీయ జోక్యం వద్దు

- పాత పద్ధతినే కొనసాగించాలి
- మొగుళ్లపల్లి-ములకలపల్లి మినీ మేడారం జాతరపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ములకలపల్లి–మొగుళ్లపల్లి గ్రామాల మధ్య రెండేళ్లకోసారి నిర్వహించే మినీ మేడారం (సమ్మక్క–సారలమ్మ) జాతరను ఈ ఏడాది కూడా పాత పద్ధతిలోనే, రాజకీయ జోక్యం లేకుండా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే. శరత్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. రిట్ పిటిషన్ నంబర్ 1136/2026లో భాగంగా పిటిషనర్ చదువు అన్నారెడ్డితో పాటు ఇతరులు 2024లో హైకోర్టును ఆశ్రయించారు. జాతరతో సంబంధం లేని వ్యక్తులు రాజకీయ జోక్యంతో, ఎండోమెంట్ అధికారుల సహకారంతో పాత కమిటీని అవమానిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రేమ్ గోపాల్ రెడ్డి కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ వివాదంలో ములకలపల్లి గ్రామానికి చెందిన పులి వీరారెడ్డితో పాటు పలువురు ఎండోమెంట్ అధికారులను పార్టీలుగా చేర్చి 2026లో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం లంచ్ మోషన్‌లో వాదనలు విన్న జస్టిస్ కే. శరత్, సమ్మక్క–సారలమ్మ జాతరలో రాజకీయ జోక్యం తగదని స్పష్టం చేస్తూ, జాతరను పాత పద్ధతిలోనే నిర్వహించాలని ఆదేశించారు. ఎండోమెంట్ శాఖ కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని, కేవలం పర్యవేక్షణ మాత్రమే చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అలాగే, ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణలో గ్రామ ప్రజలు సమన్వయంతో పాత కమిటీ ద్వారానే జాతరను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు నుంచి తమకు అనుకూలమైన ఉత్తర్వులు రావడంతో చదువు అన్నారెడ్డి వర్గం హర్షం వ్యక్తం చేసింది.

## నూతన ఎంపీడీఓను కలిసిన సిబ్బంది

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రవిందర్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవీందర్ ను తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు నవీన్ కుమార్, కార్యాలయ సిబ్బంది కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపిడిఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకురాలు  శైలశ్రీ, ఏఈ శ్రీలత, ఈసీ రజనీకాంత్, టైపిస్ట్ మసూద్ అలీ, జూనియర్ సహాయకులు ప్రియాంక, శ్రీలక్ష్మి, కార్యాలయ సహాయకులు వరుణ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.





# ఈ ఏడాదైనా సమ్మక్క జాతర వైభవంగా సాగేనా?

- కంతాత్మకూర్ మినీ మేడారం జాతర నిర్వహణపై భక్తుల్లో ఆశలు-ఆందోళనలు

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలోని కంటాత్మకూర్ గ్రామ సమీపంలో నిర్వహించనున్న మినీ మేడారం (సమ్మక్క–సారలమ్మ) జాతర ఈ ఏడాదైనా విజయవంతంగా సాగుతుందా? అన్న ప్రశ్న భక్తుల మనసుల్లో మెదులుతోంది. గత ఏడాది నిర్వహించిన జాతర పూర్తిస్థాయిలో ఆకట్టుకోలేక పోవడంతో ఈసారి మెరుగైన ఏర్పాట్లు చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. గత సంవత్సరం జాతర సందర్భంగా ప్రభుత్వ నిధులు భారీగా విడుదలైనప్పటికీ, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా మంచినీటి వసతులు లేకపోవడం, నిత్యావసర వస్తువులు అధిక ధరలకు విక్రయించడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో స్థానిక గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా తాగునీటిని సరఫరా చేయాల్సి వచ్చిన ఘటనను గ్రామస్తులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు. ఈ ఏడాది జాతర కమిటీ అధ్యక్షుడిగా కంటాత్మకూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని నియమించడంతో స్థానికులకు కొంత ఆశ కలిగింది. అయితే జాతర నిర్వహణకు సుమారు రూ.15 లక్షల నిధులు వచ్చినట్లు ప్రచారం సాగుతున్నప్పటికీ, ఆ వివరాలపై స్పష్టత లేదని కమిటీ సభ్యులే బహిరంగంగా చర్చించుకుంటుండటం చర్చనీయాంశంగా మారింది. నిధుల వినియోగంపై పాలక వర్గానికి కూడా పూర్తి సమాచారం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఈసారైనా సమ్మక్క–సారలమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించి, భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

**–రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**

అక్షర దర్బార్, భూపాల్‌పల్లి : మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని స్థాయిల్లో పూర్తి సన్నద్ధతతో ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు, పోలింగ్–కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , మున్సిపల్ కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్



అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : మండలంలోని వీఆర్కే పురం గ్రామంలో జరిగిన తోటపల్లి శ్రీనివాసరావు రజిత దంపతుల కుమారుడు నవీన్–దివ్య దంపతుల వివాహ వేడుకకు సర్పంచ్ రమ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట ఉప సర్పంచ్ రాజేశ్వరి, మాజీ సర్పంచ్ పూనం శ్రీదేవి, వార్డు సభ్యులు ప్రశాంత్, సతీష్, వీబీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దర్రా దామోదర్ తదితరులు ఉన్నారు.

# 'స్ఫూర్తి'తో విద్యార్థుల్లో మానసిక దృఢత్వం

**–వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



అక్షర దర్బార్, నర్సంపేట: విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు, మానసిక దృఢత్వం పెంపొందించడమే లక్ష్యంగా 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. బుధవారం నర్సంపేట సాంఘిక సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. నిర్దిష్ట లక్ష్యంతో క్రమశిక్షణగా చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరవచ్చని సూచించారు. మానసిక ధైర్యాన్ని పెంపొందించే రెండు షార్ట్ ఫిలింలను విద్యార్థులతో కలిసి వీక్షించారు. త్వరలో ఈ కార్యక్రమాన్ని ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలకు విస్తరిస్తామని తెలిపారు.

# సింగరేణి అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- భూపాలపల్లిలో బీఆర్ఎస్ ధర్నా



అక్షర దర్బార్, భూపాలపల్లి : సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులో జరిగిన భారీ అవినీతిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణి ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ గనుల్లో కొత్త నిబంధనల పేరుతో "సైట్ విజిట్" విధానాన్ని ప్రవేశపెట్టి అవినీతికి తావిచ్చారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయ విచారణ జరిపించి, అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సింగరేణి అవినీతిపై బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు లేవనెత్తిన అంశాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తక్షణమే స్పందించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలకు ఈ అవినీతితో సంబంధాలు లేకపోతే సీబీఐ విచారణతో పాటు సిట్టింగ్ జడ్జి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్–బీజేపీ అవినీతి బంధాన్ని ప్రజల ముందుకు తీసుకొస్తామని, సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.



# పరకాలలో గులాబీ జెండా ఎగరడం ఖాయం..

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

అక్షరదర్బార్, పరకాల: త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పరకాల గడ్డపై గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పరకాల పట్టణంలోని 4వ, 16వ వార్డులకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ విధానాలపై తీవ్ర అసంతృప్తితో తమ పదవులకు రాజీనామా చేసి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ "ప్రజల సమస్యలపై పోరాటం చేయలేని కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చి, తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న బిఆర్ఎస్ పార్టీలో చేరడం అభినందనీయమని అన్నారు. పరకాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం" అని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీలో ఏకు రమేష్, మోరే రాజకుమార్, గోవిందు రాజేందర్, మోరే సారంగపాణి, బొచ్చు దేవరాజు, గోవింద రాజు, పసుల పవన్ కళ్యాణ్, కోగిల శ్రీకాంత్, గోవింద అజయ్, నిశాంత్ తదితరులు చేరారు.

# రెండు బైకులు ఢీ : వ్యక్తి మృతి

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందారు. స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు వివరాల ప్రకారం.. మరికాల గ్రామానికి చెందిన పానుగంటి వెంకటేశ్వర్లు(52) తన బంధువైన కందాల చందుతో కలిసి బైక్ పై పని మీద వెంకటాపురం వచ్చి తిరిగి మరికాల వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతుడి భార్య పానుగంటి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# పాఠశాలలో తనిఖీ

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం మాందారిపేట ప్రాథమిక పాఠశాలను నోడల్ ఆఫీసర్ నరేంద్రనాయక్, సభ్యులు శివప్రసాద్, శ్రీనివాస్, శాయంపేట ఎంఈవో జి. భిక్షపతి తనిఖీ చేశారు. హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు రోహిణితో సమావేశమై రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి వారు చేస్తున్న కృషిని అభినందించారు. మరింతగా మెరుగు పడేందుకు తగు సూచనలు చేస్తూ పిల్లల కనీస సామర్థ్యాలు పెంపొందించాలని సూచించారు.

# నర్సంపేట ప్రజల చూపు బీజేపీ వైపు

**–బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**



అక్షర దర్బార్, నర్సంపేట: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనతో ప్రజలు విసుగు చెంది, మార్పు కోరుతూ బీజేపీ వైపు నర్సంపేట ప్రజలు చూస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో, రాడ్ బెండింగ్ సంఘం అధ్యక్షుడు కట్యాల రవి నేతృత్వంలో 40 కుటుంబాలు బీజేపీలో చేరాయి. ఈ సందర్భంగా డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి నూతన సభ్యులకు కమలం కండువాలు కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వడ్డేపల్లి నరసింహారాములు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, బీజేపీ సీనియర్ నాయకులు కూనమల్ల పృథ్వీరాజ్, కుంభం కోమల్ రెడ్డి, జూలూరి మనీష్ గౌడ్, శీలం సత్యనారాయణతో పాటు జిల్లా, పట్టణ, యువమోర్చా నాయకులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అక్షర దర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కృషి చేస్తున్నారని తెలిపారు. బుధవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. మొదట దత్తాత్రేయ కాలనీ నుండి మహబూబ్ పల్లి వరకు రూ.100 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ.100 లక్షలతో సీసీ రోడ్డు, 5 ఇంక్లైన్ వద్ద రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ భవన నిర్మాణ పనులు, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఆర్టీసీ బస్ డిపో వద్ద రూ.200 లక్షలతో సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణం, ఫక్కీరు గడ్డలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి, మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. జంగేడు వద్ద రూ.150 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. అలాగే ఎమ్మెల్యే గౌడ కులస్తుల ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించి, ఉద్యోగులను అభినందించారు. భూపాలపల్లి పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన సాయి శుభం ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. తదుపరి, గణపురం మండలం చెల్పూరులో నిర్వహించిన మార్కండేయ మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం రామ్ నగర్ కాలనీకి చెందిన గుర్రపు రామస్వామి ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం మృతుడి కుమారుడు శివకుమార్‌ను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖిరాల మధువంశీకృష్ణ, మాజీ సర్పంచ్ చిలకల రాయకోమురు, మాజీ ఎంపిటిసిలు గుర్రపు సునీత, తిరుపతి గౌడ్, కట్కూరి పద్మ నరేంద్ర, గ్రామ శాఖ అధ్యక్షులు, యువ నేతలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాస్తులు రూ.8.30 కోట్లు

- అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి నివాసాల్లో ఏసీబీ సోదాలు
- పక్కా ప్లాన్ తో ఏకకాలంలో తనిఖీలు
- ఆదాయానికి మించి కలిగి ఉన్న ఆస్తుల గుర్తింపు
- గత నెలలో రూ.60 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వెంకట్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ : అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి నివాసాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం ఉదయం మెరుపు దాడులు నిర్వహించారు. సుమారు రూ.8.30 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను గుర్తించారు. వెంకట్ రెడ్డి హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ గా పని చేశారు. హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)గానూ అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో గత డిసెంబర్ లో ఒక ప్రైవేటు పాఠశాల గుర్తింపు పత్రాల పునరుద్ధరణ కోసం రూ.60,000 లంచం తీసుకుంటూ ఆయన రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆ సమయంలో ఏసీబీ అధికారులు వెంకట్ రెడ్డి నివాసంలో రూ.30 లక్షల నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా ఏసీబీ అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా బుధవారం వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడలోని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆయన బంధువుల ఇళ్లలోనూ సోదాలు చేపట్టారు. ముఖ్యంగా ఆయన నివాసంలో కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.8.30 కోట్ల అక్రమ ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. వెంకట్ రెడ్డి విలువైన విల్లా, ఫామ్ హౌస్ తదితర ఆస్తులు కలిగి ఉన్నట్లు సోదాల్లో గుర్తించామని తెలిపారు. వెంకటరెడ్డి ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్నారు. వెంకటరెడ్డి గతంలో సూర్యాపేట అదనపు కలెక్టర్ గా, జనగామలో ఆర్డీవోగా విధులు నిర్వహించిన సమయంలో ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. గతంలో నల్గొండ జిల్లాలో తహసీల్దార్‌గా పని చేసిన సమయంలో కూడా ఈయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైనట్లు సమాచారం. పూర్తిస్థాయిలో సోదాలు ముగిసిన తర్వాత స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువపై అధికారిక ప్రకటన వెలువడనుంది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలకు దిగటం రెవెన్యూ శాఖలో కలకలం రేపింది.



# వాహనదారులు రూల్స్ పాటించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- విద్యార్థులకు అవగాహన కార్యక్రమం
- హాజరైన ఎమ్మెల్యే నాగరాజు

అక్షరదర్బార్, హనుమకొండ: నిర్లక్ష్యం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎంతో భవిష్యత్తు ఉన్న యువతను కోల్పోతున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరైవ్/ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో భీమారంలోని స్కిల్ స్టోక్ పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీపీతో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. గతేడాది తెలంగాణలో 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే వాహనం ఎవరు నడిపినా, చివరికి పోలీసులైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలను చేపడుతుందని అన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం ఆరైవ్– ఆలైవ్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు సీతారెడ్డి, సుజాత, వెంకన్న, శ్రీనివాస్, కేయూసీ ఇన్ స్పెక్టర్ రవికుమార్, స్కిల్ స్టోక్ పాఠశాల డైరెక్టర్ అనుప్ పాల్గొన్నారు.

# నర్సంపేట అభివృద్ధే ప్రథమ లక్ష్యం

- కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి



అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం, కేవలం కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధవారం నర్సంపేట పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, కమ్యూనిటీ హాళ్లు, వడ్డెర కాలనీ కమ్యూనిటీ హాల్ వంటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. మొత్తం దాదాపు 14 కోట్ల రూపాయలతో ఈ పనులు చేయబడ్డాయి. వార్డ్ వారీగా కొన్ని ముఖ్యమైన పనులలో – 24వ, 27వ వార్డుల్లో 74 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, 23వ, 30వ వార్డులో 76 లక్షలతో రోడ్లు, 28వ, 29వ, 30వ వార్డుల్లో 2 కోట్ల 19 లక్షలతో రోడ్లు, వడ్డెర కాలనీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 30 లక్షలతో శంకుస్థాపనలు జరిగాయి. అంతేకాక, ఇప్పటికే పూర్తయిన రోడ్లను ప్రారంభించడం కూడా కార్యక్రమంలో జరిగింది. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజల ముందు నర్సంపేటను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడమే తన లక్ష్యమని, ఈ అభివృద్ధి కృషి కేవలం కాంగ్రెస్ పార్టీ సమర్థవంతమైన పాలనతోనే సాధ్యమని చెప్పారు.

# యూత్ కాంగ్రెస్ చిట్యాల గ్రామ కమిటీ ఎన్నిక

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కట్కూరి సుమన్, ఉపాధ్యక్షుడిగా గడ్డం సాయినితిన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పెద్దవోయిన శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కేతిరి అశోక్ , కోశాధికారిగా కట్కూరి రాజు, ప్రచార కార్యదర్శిగా ఇర్ల రాజు, సహాయ కార్యదర్శిగా పుల్ల శ్రీకాంత్, సాద విజయ్, సోషల్ మీడియా కట్కూరి నవీన్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనాథ్ రాజుకుమార్, రమణ సాయిరాం, చరణ్, నాగేంద్ర బాబు, అరవింద్, నరేష్ పవన్, గణేష్, అజయ్, సురేందర్ పైడిప్రతాప్ సాగర్, లచ్చి, సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



# రహదారి భద్రతపై అవగాహన



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేటలో ఎస్ఐ పరమేశ్వర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు రోడ్డు సేఫ్టీ, డ్రైవింగ్ లో మద్యం సేవించొద్దని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ నివారించాలని, వాహన వేగాన్ని నియంత్రించాలని, కార్లలో సీట్ బెల్ట్ ఉపయోగించాలని అవగాహన కల్పించారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



అక్షర దర్బార్ చిట్యాల: చిట్యాల మండలం కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, మెను ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ వార్డు సభ్యులు తవటం నవీన్ ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915